## నేటి కందం-నేటికి అందం

ఆశాదీపిక యగుచు ని
రాశావాదమును ద్రుంచ నడుగిడు చుండన్
" ఆశాదీపిక " నాపర
మేశుం డాశీర్వదించె "మిస్ యూనిటి" గన్ !!

(ఆంధ్ర ప్రదేశ్ లో పుట్టి తెలంగాణా లో పెరిగి అమెరికాలో కంప్యూటర్ ఉద్యోగం చేస్తూ తన ఆశావాదంతో "అత్తలూరి ఆశాదీపిక " " మిస్ యూనిటీ 2026" కిరీటాన్ని పొందడం రెండు రాష్ట్రాల వారికీ , భారత దేశానికీ గర్వకారణం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## చురక

సర్కారుకు రిమోట్‌గా
సాగుతున్న సీఈసీ
కోట్ల ఓట్లు తొలగిస్తూ
కొనసాగితే నామోషీ.
జ్ఞానేశ్ దిగిపొమ్మని
గర్జించెను యువజనం
ఉద్యమమై దేశమంతా
ఉరకలెత్తే నేడు ఘనం.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 4-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:55 పేజీలు:6 వెల: రూ.1/-


# క్రీడలతో శారీరక ఆరోగ్యం..

### మానసిక ఉల్లాసం.. క్రమశిక్షణ
### చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి
### మంత్రి జూపల్లి కృష్ణారావు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 3: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని.. క్రీడల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎల్లూరులో క్రీడా మైదానం అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులు మారుమూల ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభను చాటాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం రోజుకు కనీసం ఒక గంట వ్యాయామానికి కేటాయించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా వసతులను మెరుగుపరిచి యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# సైబర్ నేరాలకు చెక్!

### "పిల్లలను తప్పుబట్టొద్దు.. అండగా నిలవాలి"
### "సైబర్ నేరాల బారిన పడకుండా పిల్లలను కాపాడాలి"
### పిల్లల సైబర్ భద్రతకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ
### ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల నుంచి పిల్లలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం
### ప్రతి గ్రామానికి న్యాయ సేవల కార్యక్రమాలు..
### తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పిల్లలకు మెరుగైన రక్షణ: సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్, అక్టోబర్ 3: (నేటినిజం ప్రతినిధి): డిజిటల్ వేదికలపై పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. పిల్లల భద్రత, సంరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. న్యాయ సేవల సంస్థల కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హైదరాబాద్‌లో జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం.. ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం' అనే ఇతివృత్తంతో దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. NALSA దేశవ్యాప్తంగా న్యాయ సేవలు, లోక్ అదాలత్‌లు, పిల్లల రక్షణకు సంబంధించిన న్యాయ సహాయ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవల సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకే చోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సైబర్ ల్యాబ్‌లు.. 'సైబర్ అంబాసిడర్లు'

పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ాఉఊఇ-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అఎఊఇఖీ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్ది.. తోటి విద్యార్థులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత ఆధారంగా సైబర్ నేరాల నియంత్రణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రస్తావించింది.

### 3 వేల మందికి శిక్షణ

బాధిత పిల్లలకు ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎఊాబూం, పాఠశాల విద్యాశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని.. దీని ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు 3,000 మందికిపైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు సీఎం వెల్లడించారు.

### తల్లిదండ్రులూ భాగస్వాములు కావాలి

పిల్లలు సైబర్ నేరాల వలలో పడకుండా తల్లిదండ్రులను కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పిల్లలు ఆన్‌లైన్ వేధింపులకు గురైనప్పుడు వారిని తప్పుబట్టకుండా.. సమస్యను అర్థం చేసుకుని అండగా నిలవాలని అన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930, పిల్లల సహాయం కోసం 1098 నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు.

### 'న్యాయం అంటే శిక్ష మాత్రమే కాదు'

న్యాయం అంటే నేరస్తుడికి శిక్ష పడటంతో మాత్రమే పూర్తికాదని రేవంత్‌రెడ్డి అన్నారు. బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం, గౌరవాన్ని పునరుద్ధరించడం కూడా న్యాయంలో భాగమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయమని అన్నారు. పిల్లల రక్షణకు సంబంధించిన న్యాయ సేవల ప్రాధికార సంస్థల కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. సదస్సులో జరిగే చర్చలు, సూచనలు, సిఫారసులు దేశవ్యాప్తంగా పిల్లల రక్షణకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### పలువురు న్యాయమూర్తుల హాజరు

ఈ సదస్సులో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఔంబూం ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ విక్రమ్‌నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఎఊాబూం ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ఎఊాబూం ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషి సహా పలువురు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎఊాబూం అధికారిక వెబ్‌సైట్‌లో జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్యాట్రన్ ఇన్ చీఫ్‌గా, జస్టిస్ పి.సామ్ కోషి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నమోదయ్యారు.

ఉచిత న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన మొబైల్ లోక్ అదాలత్ వాహనాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి, న్యాయమూర్తుల సమక్షంలో ప్రారంభించారు.

# ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..



వికారాబాద్, అక్టోబర్ 3: వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించిన ఎస్పీ.. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

### సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ప్రమాదంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సర్ పేరుతో తొలగించిన ఓట్లను మళ్లీ జాబితాలో చేర్చాలి : నటుడు ప్రకాష్‌రాజ్

హైదరాబాద్, అక్టోబర్ 3:స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో తొలగించిన ఓట్లన్నింటిని తిరిగి ఓటర్ల జాబితాల్లో పునరుద్ధరించాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాష్‌రాజ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్దేశపూర్వకంగానే కొందరి ఓట్లను తొలగించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారని ఆరోపించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రకాష్‌రాజ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13.4 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాల నుంచి తొలగించడం తీవ్ర వివాదానికి దారితీసింది. ముఖ్యంగా వలస కార్మికులు, దళితులు, ముస్లింల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ప్రకాష్ రాజ్ ఆరోపించారు. ఇప్పటికే ఏటా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుండగా.. కొత్తగా ఈ ప్రత్యేక సవరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు.

దేశంలో అక్రమ చొరబాటుదారులు ఉంటే ఇన్నాళ్లూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఏం చేసింది.. అని ప్రకాష్‌రాజ్ నిలదీశారు. ఇంట్లోలేని వాళ్ల ఓట్లను తీసేశారని మండిపడ్డారు. ముస్లింలు, దళితుల ఓట్లను తొలగించడమే వారి ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు.

# అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి : మాజీ మంత్రి తలసాని




హైదరాబాద్, అక్టోబర్ 3:రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు పత్రాలను పలువురు గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్యే తలసాని కి అందజేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# యూనిట్‌కు రూ.12 పెట్టైనా కరెంటు కొంటాం : పొంగులేటి

### పేదోడి ప్రజా ప్రభుత్వం.. దొరల ప్రభుత్వం కాదు
### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
### పాలేరు వాగుపై చెక్‌డ్యామ్‌తో రైతులకు ఎంతో మేలు
### 250 ఎకరాలకు సాగునీరు!
### రూ.6.65 కోట్లతో నిర్మాణం పూర్తి..
### ప్రారంభించిన మంత్రి పొంగులేటి
### కట్టుకాచారంలో 35 నెలల్లో రూ.13.50 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పనులు
### తొలి విడతలో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేశామన్న మంత్రి



ఖమ్మం, అక్టోబర్ 3:ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.6.65 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ చెక్‌డ్యామ్ అందుబాటులోకి రావడంతో సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగడంతోపాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

చెక్‌డ్యామ్ ప్రారంభంతో పాటు కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రాయగూడెం నుంచి తక్కెళ్లపాడు వరకు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు, గ్రామ అంతర్గత రోడ్లకు రూ.52 లక్షలు, విద్యుత్ లైన్ల మార్పిడికి రూ.7.50 లక్షలు, తాగునీటి వసతులకు రూ.3.50 లక్షలు, అంగన్‌వాడీ భవనం తదితర పనులకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 35 నెలల్లో కట్టుకాచారం గ్రామంలో సుమారు రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. అనంతరం 31 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

దేశవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని మంత్రి అన్నారు. నీటి కొరత పరిస్థితుల్లో చెక్‌డ్యామ్‌లు, ఇతర నీటి సంరక్షణ నిర్మాణాలు రైతులకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తికి ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సౌర, పవన తదితర ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని చెప్పారు. అవసరమైతే యూనిట్‌కు రూ.12 చెల్లించి విద్యుత్ కొనుగోలు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

గత పాలకుల తరహాలో తమది దొరల ప్రభుత్వం కాదని.. పేదలకు అండగా ఉండే ప్రజా ప్రభుత్వమని పొంగులేటి అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో 2.25 లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు.

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. చెక్‌డ్యామ్‌ను నిర్ణీత కాలంలో పూర్తి చేయడంలో అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది కృషి చేశారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 'జనరేటర్ స్కీమ్ త్వరగా అమలు చేయాలి'

ఖమ్మం, అక్టోబర్ 3: తురకకాశ కార్మికుల కోసం జనరేటర్ స్కీమ్‌ను అమలు చేయాలని ఆ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బికారి సంఘ నాయకులతో కలిసి శనివారం కలెక్టర్ కార్యాలయంలో బీఎండబ్ల్యూవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జనరేటర్ స్కీంకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న చంద్రుగొండ, అశ్వారావుపేట, బూర్గంపహాడ్, అశ్వాపురం నాలుగు మండలాలకు చెందిన అర్హులైన తురకకాశ కార్మికులకు త్వరితగతిన జనరేటర్లను పంపిణీ చేయాలని కోరారు. అర్హులైన లబ్దిదారులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తురకకాశ సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్య పరిరక్షణతోనే జంతు సంక్షేమం

## (04 అక్టోబర్ "ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం" సందర్భంగా)

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో జంతువుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంతు సంక్షేమ సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోని యెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

### భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం,

మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే తనకు కావలసిన కనీస అవసరాలైన కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న జంతువుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి "సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసీ ఫీస్ట్ డే" రోజు ప్రతి ఏట 04 అక్టోబర్ "ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం లేదా వరల్డ్ ఆనిమల్ వెల్ఫేర్ డే" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

### 2026 ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం ఇతివృత్తం:

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది.

ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, న

ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. "ఇంటర్నేషన్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా" అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో జంతు సంక్షేమ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి.

ప్రపంచ జంతు సంక్షేమ దినం-2026 ఇతివృత్తంగా "వాటి నేత్రాలతో చూద్దాం (సీ ది వరల్డ్ త్రూ దేర్ ఐస్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది.

### ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా చేయదగిన కార్యక్రమాలు:

ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యతకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి.

ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.



-మధుపాళీ
9949700037

# వన్యప్రాణుల పరిరక్షణపై అవగాహన



ఆదిలాబాద్, అక్టోబర్ 3:వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా తాళ్లపేట ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంపద ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. అదేవిధంగా కడెం ప్రధాన కాల్వ 19వ డిస్ట్రిబ్యూటర్ నుంచి వనదర్శిని కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులకు ప్రకృతి, అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ సాగరిక, ఫారెస్టు అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 4.240 కిలోల నల్లమందును స్వాధీనం చేసుకున్న సీబీఎన్ మధ్యప్రదేశ్ యూనిట్ ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) మధ్యప్రదేశ్ విభాగం తమ నిరంతర మాదకద్రవ్యాల నిరోధక కార్యకలాపాల్లో భాగంగా ఒక కీలకమైన ముందడుగు వేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు 30.09.2026న కంజర్దా..మానస రహదారిపై ఒక హీరో గ్లామర్ మోటార్సైకిల్ తనిఖీలో 4.240 కిలోల నల్లమందును స్వాధీనం చేసుకుంది. ఈ స్వాధీనానికి సంబంధించి ఒక వ్యక్తిని అధికారులు అరెస్టు చేశారు. నిషేధిత వస్తువుల రవాణాకు ఉపయోగించిన మోటార్సైకిల్నూ స్వాధీనం చేసుకున్నారు.

నీముచ్ రిజిస్ట్రేషన్ గల హీరో గ్లామర్ మోటార్సైకిల్పై ఒక వ్యక్తి కంజర్దా నుంచి మానస వైపు సుమారు 4?5 కిలోల నల్లమందును తీసుకు వెళ్తున్నాడని విశ్వసనీయ సమాచారం అందడంతో సీబీఎన్ మందసార్, పిడిఐ సెల్ అధికారుల బృందాన్ని అనుమానిత మార్గంలో మోహరించారు.

ఈ బృందం కంజ ర్ద-మానస మార్గంలో కట్టుదిట్టమైన నిఘా ఉంచింది. అనుమానిత మోటార్సైకిల్ను గుర్తించిన అధికారులు, దానిని అడ్డగించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మొత్తం 4.240 కిలోల నల్లమందు ఉన్న రెండు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

అవసరమైన అన్ని చట్టపరమైన లాంఛనాలను పూర్తి చేసిన తర్వాత, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) చట్టం-1985లోని సంబంధిత నిబంధనల ప్రకారం... హీరో గ్లామర్ మోటార్సైకిల్తో పాటు స్వాధీనం చేసుకున్న నల్లమందునూ జప్తు చేసి, వ్యక్తిని అరెస్టు చేశారు.

నిషేధిత సరుకు మూలం, ఉద్దేశించిన గమ్యస్థానాన్ని నిర్ధారించడం, ఈ అక్రమ రవాణా నెట్వర్క్తో ఇతర వ్యక్తుల సంబంధాలను గుర్తించడం లక్ష్యంగా తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

నిరంతర నిఘా ఆధారిత అమలు చర్యల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగాన్ని ఎదుర్కోవడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ కట్టుబడి ఉంది. నషా ముక్త్ భారత్ దార్శనికత పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

# కల్లూరు రైస్ మిల్లులో తనిఖీలు.. ధాన్యం సీజ్

ఆదిలాబాద్, అక్టోబర్ 3:నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని శ్రీ ఆంజనేయ రైస్ మిల్లులో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులోని ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసాన్ని గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం మిల్లులో 1,11,000 సంచులు (4,440 మెట్రిక్ టన్నులు) ధాన్యం నిల్వ ఉండాల్సి ఉంది. అయితే తనిఖీల సమయంలో 18,000 సంచులు (720 మెట్రిక్ టన్నులు) మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో 93,000 సంచులు (3,720 మెట్రిక్ టన్నులు) ధాన్యం కొరత ఉన్నట్లు నిర్ధారించారు. నిల్వల్లో భారీ వ్యత్యాసాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు తక్షణమే రైస్ మిల్లులో ధాన్యాన్ని సీజ్ చేశారు. మిల్లులో ఉన్న లారీలోని ధాన్యాన్ని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. రైస్ మిల్లర్ అందుబాటులో లేకపోవడంతో శనివారం పూర్తి వివరాలను వెల్లడించి, నిబంధనల ప్రకారం పంచనామా నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. వరి ధాన్యం విషయంలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లైస్ డీటీ ఆర్ఐ తక్కన్న, రెవెన్యూ శాఖ ఆర్ఐ అడెల్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## మిగిలి ఉన్న అంశాలను పరిష్కరించడానికి 'ప్రత్యేక ప్రచార కార్యక్రమం 6'ను ప్రారంభించిన ఉక్కు శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:'మిగిలి ఉన్న అంశాలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రచార కార్యక్రమం (స్పెషల్ క్యాంపెయిన్ ఫర్ డిస్పోజల్ ఆఫ్ పెండింగ్ మేటర్స్.. ఎస్సీడీపీఎమ్) 6'ను ఉక్కు శాఖ, ఆ శాఖకు చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈస్) చేపట్టాయి. ఈ నెల 2 నుంచి ఈ నెల 31 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉక్కు శాఖ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు చురుకుగా పాల్గొంటున్నాయి.

ప్రచార ఉద్యమ సన్నాహక దశను కిందటి నెల 15 నుంచి కిందటి నెల 30 వరకు చేపట్టి, పూర్తి చేశారు. ఆ దశలో మంత్రిత్వ శాఖ, సీపీఎస్ఈలు అవసరమైన సన్నాహాలు చేయడంతో పాటు అమలు దశకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించాయి.

అమలు దశను ఈ నెల 2 నుంచి ఈ నెల 31 వరకు నిర్వహిస్తారు. ఈ దశలో మంత్రిత్వ శాఖ, సీపీఎస్ఈలు ఈ కింది కార్యకలాపాలపై దృష్టిని కేంద్రీకరిస్తాయి:

స్వచ్ఛత ప్రచార ఉద్యమం: దీన్లో భాగంగా వివిధ కార్యాలయాలు, ప్రదేశాల్లో 301 శుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ఫైళ్ల పరిష్కారం: 20,763 ఫైళ్లతో పాటు 9,056 ఎలక్ట్రానిక్ ఫైళ్లను పరిష్కరించే ప్రయత్నం చేస్తారు.

ప్రజా ఫిర్యాదులు: నిలిచి ఉన్న 37 ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఏ ఒక్క ఫైలునూ పరిశీలన స్థితిలో అట్టిపెట్టకూడదన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

ఎంపీలు, ప్రధానమంత్రి కార్యాలయం, మంత్రిమండలితో పాటు రాష్ట్ర ప్రభుత్వాల సిఫారసులు సహా అనిశ్చిత వ్యవహారాలను కాలబద్ధ రీతిన పరిష్కరించడంపై ఈ ప్రచార ఉద్యమంలో దృష్టి పెడతారు. స్వచ్ఛత, పాత ఫైళ్ల పని పూర్తి చేయడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు కార్యాలయంలో జాగాను ఉత్తమమైన పద్ధతిలో వినియోగించడంపై శ్రద్ధ వహిస్తారు.'మిగిలి ఉన్న అంశాలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రచార ఉద్యమం (ఎస్సీడీపీఎమ్) 6'ను అమలు చేస్తూ ఉక్కు మంత్రిత్వ శాఖ, సీపీఎస్ఈలు కలిసి పరిశీలనలో ఉన్న అంశాలను తగ్గించుకోవడం, అంశాలను వెంటవెంటనే చక్కబెట్టడం, ఉత్తమ సేవలను అందజేయడంతో పాటు పని ప్రదేశాలు శుభ్రంగా ఉండేటట్లు చూస్తూ, సమర్థ సేవల్ని అందించే దిశగా ముందుకు కదులుతాయి.

# వైద్యరంగంలోని ప్రతి ప్రత్యేక విభాగంలో వేగవంతమైన సాధనంగా రోబోటిక్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3:వైద్య రంగంలో రోగ నిర్ధారణ నుంచి చికిత్స దాకా ప్రతి విభాగంలోనూ రోబోటిక్స్ ఒక వేగవంతమైన సాధనంగా మారనుందని ప్రముఖ వైద్యులు, మధుమేహ వ్యాధి నిపుణులు, కేంద్ర శాస్త్ర-సాంకేతిక శాఖ, ఎర్త్ సైన్సెస్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

కృత్రిమ మేధ, నానోసైన్సలతో కలిపి రోబోటిక్స్.. కచ్చితమైన ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవలను అందించే ఒక సమగ్ర వ్యవస్థను సృష్టిస్తుందని ఆయన తెలిపారు. ఒక వ్యక్తి జన్యుపరమైన వివరాలు, పర్యావరణ పరిస్థితులు, జీవనశైలి, ఆహారపు అలవాట్లను బట్టి... సరికొత్త సాంకేతికతల సాయంతో మరింత వ్యక్తిగతీకరించిన వైద్య సేవలను అందించడం దీని ద్వారా సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

సొసైటీ ఆఫ్ రోబోటిక్ సర్జరీ అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభోపన్యాసం చేశారు. రోబోటిక్స్ను కేవలం శస్త్రచికిత్సలకు మాత్రమే పరిమితం చేయకుండా, వైద్య రంగానికి చెందిన అన్ని విభాగాలకూ విస్తరించాల్సిన సాధనంగా చూడాలని ఆయన పేర్కొన్నారు. "ఇది ఒక సాధనం. ఇది ప్రతిచోటా కనిపిస్తుంది" అని ఆయన అన్నారు. ప్రస్తుత సదస్సు రోబోటిక్ సర్జరీపై దృష్టి సారించినప్పటికీ... వివిధ వైద్య విభాగాల్లో ఏఐ అనువర్తనాలను కనుగొంటున్న విధంగానే, భవిష్యత్తులో రోబోటిక్ మెడిసిన్, రోబోటిక్ ఎండోక్రినాలజీ, రోబోటిక్ కార్డియాలజీ వంటి విభాగాలు ఆవిర్భవించవచ్చని ఆయన తెలిపారు.

21వ శతాబ్దంలో ఏఐ, బయోటెక్నాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఇతర సాంకేతికత ఆధారిత పరిష్కారాల ఆవిర్భావంతో... వైద్యరంగం సరికొత్త పద్ధతుల ఉత్తేజకరమైన దశలోకి ప్రవేశిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. తదుపరి దశలో క్వాంటం టెక్నాలజీలు, నానోమెడిసిన్, రోబోటిక్స్లో పురోగతితో పాటు... జన్యుపరమైన రోగ నిర్ధారణ పరిష్కారాల వినియోగం మరింత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఒకే వ్యాధితో బాధపడుతున్నప్పటికీ, ప్రతి రోగికి వారి వారి అవసరాలకు అనుగుణంగా చికిత్సా విధానాలు రూపొందించాల్సిన అవసరం కచ్చితమైన వైద్య విధానంలో పెరుగుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. జన్యుపరమైన ప్రొఫైల్, పర్యావరణ పరిస్థితులు, జీవనశైలి, ఆహారపు అలవాట్లు వైద్య నిర్ణయాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయన్నారు. తద్వారా సాంకేతికత ఆధారితమైన, వ్యక్తిగతీకరించిన ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు వైద్యంలో కీలక భాగంగా మారుతుందని ఆయన అన్నారు.

జీనోమ్ ఇండియా కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పటికే 10,000 మంది వ్యక్తుల జన్యుక్రమాన్ని నిర్ధారించారని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రతి నవజాత శిశువు జన్యుక్రమాన్ని నిర్ధారించే దిశగా భారత్ పయనించగలదని డాక్టర్ జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. 140 కోట్ల జనాభాకు ఇంతటి వివరణాత్మక జన్యుక్రమాన్ని నిర్ధారించడంలో ఏఐ, రోబోటిక్స్ను అత్యుత్తమంగా ఉపయోగించుకోవలసి ఉంటుందనీ ఆయన పేర్కొన్నారు.

దీర్ఘకాలంగా ఉన్న ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించడంలో నానోమెడిసిన్ సామర్థ్యాన్ని గురించి కేంద్ర మంత్రి వివరించారు. నోటి ద్వారా తీసుకునే ఇన్సులిన్ను అభివృద్ధి చేసే ప్రయత్నాలను ప్రముఖంగా ప్రస్తావించారు. నానో స్థాయిలో జరిగే పురోగతి... సాంప్రదాయిక ఔషధ పంపిణీకి సంబంధించిన పరిమితులను అధిగమించడానికి, చికిత్సా విధానాలకు కొత్త అవకాశాలను అందుబాటులోకి తీసుకు రావడానికి సహాయపడతాయని ఆయన అన్నారు.

భారత పరిమాణం, వైవిధ్యం, భౌగోళిక విస్తరణ కారణంగా ఆరోగ్య సంరక్షణ అందించడంలో ఏఐ, రోబోటిక్స్, టెలి-రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ప్రత్యేకంగా ఉపయోగపడతాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. రోబోటిక్ అల్ట్రాసోనోగ్రఫీతో తన అనుభవాన్ని పంచుకున్నారు. రిమోట్గా పనిచేసే వైద్య సాంకేతికతల అవకాశాలను ప్రదర్శిస్తూ... అంటార్కిటికాలో 10,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక వ్యక్తికి తాను అల్ట్రాసౌండ్ పరీక్ష నిర్వహించానని ఆయన చెప్పారు.

సాంప్రదాయిక నిపుణుల ఆరోగ్య సంరక్షణ నమూనాలో రాబోయే సంభావ్య మార్పును డాక్టర్ జితేంద్ర సింగ్ వివరిస్తూ... "రోగిని డాక్టర్ వద్దకు పంపడానికి బదులుగా, డాక్టరే రోగి వద్దకు వెళ్లేలా ఈ మార్పు ఉంటుంది" అని పేర్కొన్నారు. టెలి-రోబోటిక్స్ సాంకేతికత ద్వారా భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా నిపుణులైన వైద్య సేవలను రోగుల వద్దకే చేర్చవచ్చని ఆయన తెలిపారు. దీనివల్ల రోగి సదరు వైద్య నిపుణుల వద్దకు ప్రయాణించే అవసరం లేకుండానే, అత్యాధునిక వైద్య సేవలను అందుకోవడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

అంటువ్యాధులతో పాటు జీవక్రియ, జీవనశైలి సంబంధిత రుగ్మతలూ సహజీవనం సాగిస్తున్న భారత్లో... మారుతున్న వ్యాధుల ప్రొఫైల్ గురించి కేంద్ర మంత్రి మాట్లాడారు. సాధారణంగా వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు ఇప్పుడు యువకుల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితి దేశంలో సంక్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ వాతావరణాన్ని సృష్టిస్తోందన్నారు. దీనిని ఎదుర్కోవడానికి అధునాతన సాంకేతిక సాధనాలు సహా మరింత సమగ్రమైన, సంపూర్ణమైన విధానం అవసరమని ఆయన పేర్కొన్నారు.

భారత ఆరోగ్య సంరక్షణ అవసరాల పరిమాణం, వైవిధ్యం కారణంగా కొత్త సాంకేతికతలను స్వీకరించడం ఇక్కడ చాలా ముఖ్యమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దేశవ్యాప్తంగా వైద్య సేవలను అందించడంలో ఏఐ, రోబోటిక్స్ శక్తిమంతమైన సహాయక సాధనాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కచ్చితమైన, వ్యక్తిగతీకరించిన వైద్య విధానం దిశగా సాగే పరిణామానికి ఇవి మద్దతుని స్తాయని ఆయన పేర్కొన్నారు.

రోబోటిక్ సర్జరీని సంస్థాగత అభ్యాసం, విద్యాసంబంధమైన, వృత్తిపరమైన సమావేశ వేదికల పరిధిలోకి తీసుకువచ్చినందుకు ఎస్ఆర్ఎస్ ఇండియా-2026 నిర్వాహకులను డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. వేగంగా మారుతున్న వైద్య విజ్ఞాన రంగానికి అనుగుణంగా ముందుకు సాగడానికి రోబోటిక్స్ వంటి సరికొత్త సాంకేతికతలను స్వీకరించడం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# వ్యవసాయ సమస్యలపై ముఖాముఖి



ఆదిలాబాద్, అక్టోబర్ 3:గూడెం రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణ, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గూడెం క్లస్టర్కు నూతన ఏఈఓగా బాధ్యతలు చేపట్టారు. కన్నెపల్లి గ్రామ సర్పంచ్ చుంచు నాగేష్, ఉపసర్పంచ్ ముత్తె శంకరయ్య, గూడెం మాజీ ఎంపీటీసీ తోట మోహన్తో పాటు ఏవో శ్రీకాంత్లు కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అనంతరం ఏడీఏ కృష్ణ రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తూ, సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అందుబాటులో ఉన్న వ్యవసాయ సేవల గురించి వివరించారు. రైతులు తమ సందేహాలను నేరుగా వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువచ్చి, తగిన సూచనలు పొందేందుకు రైతు నేస్తం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు, వ్యవసాయ అధికారులకు మధ్య ప్రత్యక్ష సంబంధాలు బలోపేతం కావడంతో పాటు వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కన్నెపల్లి, గూడెం ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హర్యానా నుంచి కెనడాకు ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఫ్రోజెన్ ఆహార ఉత్పత్తుల ఎగుమతులను సులభతరం చేసిన ఏపీఈడీఏ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) హర్యానాలోని సోనిపట్ నుంచి కెనడాకు ఎగుమతుల ప్రక్రియను సులభతరం చేసింది. 24 మెట్రిక్ టన్నుల (ఎంటీల) ఫ్రోజెన్ ఆహార ఉత్పత్తుల ఎగుమతిని ఈ సంస్థ నిన్న అధికారికంగా ప్రారంభించింది. 'అటెర్నా ఫుడ్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' ఎగుమతి చేసిన ఈ రవాణాలో 2,295 బాక్సుల ఫ్రోజెన్ ఆహార ఉత్పత్తులు ఉన్నాయి. ఈ మొత్తం సరుకు విలువ 35,140 కెనడియన్ డాలర్లు (సీఏడీ).

రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎగుమతిలో పచ్చి బఠానీలు, పలు రకాల కూరగాయలు, బఠానీలు-క్యారెట్లు, స్వీట్ కార్న్, సమోసాలతో పాటు మరికొన్ని ఇతర ఉత్పత్తులూ ఉన్నాయి. ఈ ఎగుమతి యూనిట్ కోసం ఏపీఈడీఏ సంస్థ తన ఆర్థిక సహాయ పథకం కింద మద్దతు అందించింది. భారతీయ ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలను విస్తరించడం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రపంచవ్యాప్త కొనుగోలుదారులు, మార్కెట్లతో అనుసంధానించడం దిశగా ఈ ఎగుమతి మరో కీలక ముందడుగు.

ఎగుమతి ఆధారిత వాణిజ్య వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో, మన రైతులు అంతర్జాతీయ మార్కెట్లను చేరుకోవడంలో పెరుగుతున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థల పాత్రను ఈ ఎగుమతి ప్రముఖంగా చాటుతోంది. మార్కెట్ సౌకర్యాలను బలోపేతం చేయడం, రైతు సమూహాలను ఎగుమతి అవకాశాలతో అనుసంధానించడం వంటి లక్ష్యాలతో కూడిన పలు కార్యక్రమాల ద్వారా ఎఫ్‌పీవోలు/ఎఫ్‌పీసీలు, ఎగుమతిదారుల మధ్య సంబంధాలనూ ఏపీఈడీఏ సులభతరం చేస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్‌తో, అంతర్జాతీయ మార్కెట్లతో జోడించడం ద్వారా... ఈ ఎఫ్‌పీవో ఆధారిత నమూనా రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించడంలో తోడ్పడుతుంది. ఎగుమతి వాణిజ్య వ్యవస్థలో రైతు సమూహాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

ఈ సమావేశంలో ఏపీఈడీఏ ఛైర్మన్ శ్రీ అభిషేక్ దేవ్ ప్రసంగిస్తూ... ఎగుమతిదారులను, దీనికి సహకరించిన వారందరినీ అభినందించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) నేరుగా ఎగుమతి చేయడం వల్ల రైతులు తమ ఉత్పత్తులపై మరింత మెరుగైన లాభాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో నిఫ్టెమ్ అందించిన అమూల్య సహకారాన్నీ ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కెనడా మార్కెట్‌కు ఎగుమతులను మరింతగా విస్తరించడంపై శ్రీ అభిషేక్ దేవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'ఏపీఈడీఏ'... భారతీయ వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానాన్ని, ఎగుమతి అవకాశాలను నిరంతరం సులభతరం చేస్తోంది. ప్రపంచ వాణిజ్య వ్యవస్థల్లో మన రైతు సమూహాల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికీ నిరంతరం మద్దతునిస్తోంది.

# ఏపీఈడీఏ సహకారంతో పూర్ణియా నుంచి గ్రీస్‌కు బిహార్ మఖానా ఎగుమతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:వ్యవసాయం, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) సహకారంతో బిహార్‌లోని పూర్ణియా నుంచి 1 మెట్రిక్ టన్నుల పాప్డ్ (ఫూల్) మఖానాను గ్రీస్ దేశానికి ఎగుమతి చేశారు. బిహార్ సంప్రదాయ ఉత్పత్తి అయిన మఖానాకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత విస్తృత అవకాశాలు కల్పించడంతో పాటు, విదేశీ ఎగుమతి ఆధారిత విలువ వ్యవస్థల ద్వారా స్థానిక రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలను కల్పించే దిశగా ఇది కీలక చర్యగా నిలిచింది.

పూర్ణియాలోని బెలౌరీకి చెందిన ఇండో గ్లోబల్ ఎక్స్‌పోర్ట్ నుంచి ఈ సరుకును సేకరించారు. న్యూఢిల్లీలోని ఎస్ఎస్ ఫుడ్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ద్వారా దీనిని గ్రీస్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఈ సరుకు భారత్‌లోని ముంద్రా ఓడరేవు నుంచి గ్రీస్‌లోని పిరాయస్ పోర్టుకు రవాణా కానుంది.

దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం లభిస్తున్న విక్రయ ధరతో పోలిస్తే ఈ ఎగుమతి ద్వారా మఖానాకు అధిక ధర లభించింది. అంతర్జాతీయ మార్కెట్లు మఖానా ఉత్పత్తిదారులకు అదనపు విలువను సృష్టించే సామర్థ్యాన్ని ఇది చాటిచెబుతోంది. ఎగుమతుల ఆధారిత మార్కెట్ అందుబాటు ద్వారా ఉత్పత్తిదారులు, అంతర్జాతీయ కొనుగోలు దారుల మధ్య అనుసంధానాలను బలోపేతం చేయడంతో పాటు, రైతులకు మెరుగైన ఆదాయాలు లభించే అవకాశాలను కూడా కల్పించవచ్చు.

మఖానా ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశ మొత్తం మఖానా ఉత్పత్తిలో బిహార్ వాటా సుమారు 80 నుంచి 85 శాతంగా ఉంది. బిహార్‌లోని 10 జిల్లాల్లో 35,000 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో మఖానా సాగు జరుగుతోంది. సబౌర్‌లోని బిహార్ వ్యవసాయ యూనివర్సిటీ (బీఏయూ), దర్భంగాలోని ఐసీఏఆర్-జాతీయ మఖానా పరిశోధనా కేంద్రం నుంచి క్షేత్రస్థాయిలో అందుతున్న సాంకేతిక సహకారంతో ఈ రంగానికి మద్దతు లభిస్తోంది.

బిహార్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీఈడీఏ ఛైర్మన్ శ్రీ అభిషేక్ దేవ్, బిహార్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఉద్యానవన డైరెక్టర్ శ్రీ అభిషేక్ కుమార్‌తో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు, మఖానా ఎగుమతి వ్యవస్థతో అనుబంధం ఉన్న ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

సమావేశంలో శ్రీ విజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. "మఖానా అంతర్జాతీయ మార్కెట్లకు నిరంతరం చేరుతున్న నేపథ్యంలో ఈ ఎగుమతి బిహార్ మఖానా రంగానికి ఒక ముఖ్యమైన మైలురాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 20కి పైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు 7,000 మెట్రిక్ టన్నులకు పైగా మఖానా, 22 మిలియన్ డాలర్ల విలువైన విలువ ఆధారిత మఖానా ఉత్పత్తులను ఎగుమతి చేసింది" అని తెలిపారు.

రైతులకు మద్దతు అందించడంతో పాటు ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా వారి ఆదాయాలను మెరుగుపరచే లక్ష్యంతో బిహార్ ప్రభుత్వం వ్యవసాయ ఎగుమతి విధానాన్ని రూపొందించేందుకు కృషి చేస్తోందని ఆయన తెలిపారు. మఖానా ఎగుమతి విలువ వ్యవస్థకు మద్దతు అందించేందుకు ప్యాకింగ్ కేంద్రాలను కూడా అభివృద్ధి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మఖానా ఎగుమతులను విస్తరించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా ఏపీఈడీఏ నిరంతరం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

బిహార్ మఖానా ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించేందుకు జరుగుతున్న విస్తృత ప్రయత్నాల్లో భాగంగా పూర్ణియా నుంచి గ్రీస్‌కు ఈ ఎగుమతి జరుగుతోంది. బిహార్‌తో మఖానాకు ఉన్న బలమైన సంప్రదాయ, సాంస్కృతిక అనుబంధం నేపథ్యం లో ఇది భారత్ వ్యవసాయ ఎగుమతుల జాబితాలో ఒక ముఖ్యమైన ఉత్పత్తిగా ఎదిగింది.

భారతీయ మఖానాను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు ఏపీఈడీఏ మార్కెట్ అనుసంధానాలను సులభతరం చేయడంతో పాటు ఎగుమతిదారులకు మద్దతు అందిస్తోంది. యూరప్ మార్కెట్లలోకి కూడా మఖానా ఎగుమతులు విస్తరిస్తున్నాయి. భారతీయ ఉత్పత్తిదారులకు పెరుగుతున్న అవకాశాలతో పాటు, సంప్రదాయ మార్కెట్లకు మించి కొత్త మార్కెటలోకి విస్తరించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రయత్నాల ద్వారా బిహార్‌లోని మఖానా ఉత్పత్తిదారులను అంతర్జాతీయ డిమాండ్లతో అనుసంధానించడంతో పాటు, రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు, ఎగుమతి విలువ వ్యవస్థలో ఉత్పత్తిదారుల సంఘాల అధిక భాగస్వామ్యానికి అవకాశాలు ఏర్పడుతున్నాయి.

# గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి..

## ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన పాలకవర్గం



కరీంనగర్, అక్టోబర్ 3:పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ సోమ కుమార్, ఉపసర్పంచ్ గుమ్మడి సోని విజయ్ కుమార్, వార్డు సభ్యులు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుకు శని వారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మంజూరైన నూతన పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

అప్పన్నపేట నుంచి రాగినేడు వరకు రహదారిని విస్తరించి బీటీ రోడ్డు నిర్మించాలని, గ్రామస్థులు, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతులను బోన్ల ద్వారా పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నెంబర్ 301ప్రభుత్వ భూమిలో విమానాశ్రయం కోసం గతంలో కేటాయించిన భూమిని యాజమాన్యం తిరిగి ప్రభుత్వానికి అప్పగించినందున, దానిని గ్రామపంచాయతీకి లేదా నిరుపేద కుటుంబాలకు సాగు కోసం కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.మహిళా సంఘాల భవనం, ముత్యాల కుంట చెరువుకు ఎస్సా రెస్పీ కాలువ లైనింగ్, ఎస్సీ మా ల కాలనీకి ప్రత్యేక వాటర్ ట్యా ంకు, కమ్యూనిటీ హాల్ నిర్మాణా లకు నిధులు కేటాయి ంచాలని, లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయ డంతోపాటు, నూతన గ్రామపం చాయతీ, అంగన్‌వాడీ భవనాలు నిర్మించా లని విజ్ఞప్తి చేశారు. గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే సాను కూలంగా స్పంది ంచి, సంబంధిత శాఖల అధికారు లతో మాట్లాడి పరిష్కారా నికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు

# ప్రధానమంత్రికి వచ్చిన బహుమతుల పీఎం మెమెంటోస్ ఈ-వేలం అక్టోబర్ 31 వరకు పొడిగింపు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:ప్రధానమంత్రికి వచ్చిన ప్రత్యేకమైన బహుమతులు, కళాఖండాలను ప్రదర్శించే పీఎం మెమెంటోస్ 8వ విడత వేలం ప్రస్తుతం కొనసాగుతోంది. ఈ?వేలం గడువును 2026 అక్టోబర్ 31 వరకు పొడిగించారు.

ఈ విడతలో ఢిల్లీ నగరంలోని విభిన్న కోణాలను ప్రతిబింబించే 30 రకాల జ్ఞాపికలు ఉన్నాయి. ప్రజా వేలానికి అందుబాటులో ఉన్న ఈ సేకరణలో వివిధ రకాల కళాఖండాలు, భక్తి సంబంధిత వస్తువులు, హస్తకళా వస్తువులు, సంస్థాగత జ్ఞాపికలు ఉన్నాయి. ఇవి ప్రత్యేకమైన జ్ఞాపకాలుగా నిలిచే అవకాశం ఉంది. ఈ వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని నమామి గంగే ప్రాజెక్టుకు అందించనున్నారు.

ఈ 30 జ్ఞాపికల్లో తొమ్మిది ఫొటో ఫ్రేమ్‌లు, 9 ఇతర జ్ఞాపికలు, ఆరు విగ్రహాలు, శిల్పాలు, ప్రతిమలు ఉన్నాయి. వీటితో పాటు ఢిల్లీ మెట్రోకు సంబంధించిన 2 నమూనాలు, ఒక క్రీడా జ్ఞాపిక, ఒక పెయింటింగ్, కళా, హస్తకళా వస్తువులు తదితరాలు కూడా ఈ సేకరణలో ఉన్నాయి.

దేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు సంబంధించిన పలు స్మారక చిహ్నాలు ఈ సేకరణలో ఉన్నాయి. వీటిలో నాలుగు జ్ఞాపికలు శ్రీరాముడు లేదా రామాయణంలోని ఘట్టాలను ప్రతిబింబిస్తాయి. వీటిలో రామ దర్బార్ శిల్పం, కేవట్‌తో కలిసి శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు నదిని దాటుతున్న దృశ్యాన్ని చిత్రించిన ఇత్తడి ఫలకం, పాలం గ్రామానికి చెందిన సంత్ దాదా దేవ్ చిత్రపటం, చెక్కతో చెక్కిన రామలల్లా విగ్రహం ఉన్నాయి.

బౌద్ధమతంలోని అష్ట మంగళ చిహ్నాల ప్రతిరూపం కూడా ఈ సేకరణలో ఉంది. అష్టమంగళం అని కూడా పిలిచే ఈ ఎనిమిది శుభ చిహ్నాలకు లోతైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఇవి సంప్రదాయంగా బౌద్ధ బోధనలు, బుద్ధుని జ్ఞానోదయంతో అనుబంధం కలిగి ఉన్నాయి.

ఈ సేకరణలో ఢిల్లీలోని ప్రముఖ సంస్థలు, చారిత్రక ప్రదేశాలకు సంబంధించిన అనేక కళాఖండాలు ఉన్నాయి. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీని చిత్రించిన ఫ్రేమ్ చేసిన కళాఖండం, పాత సచివాలయ భవనం క్రిస్టల్ జ్ఞాపిక, కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రతిబింబించే వస్త్ర కళాఖండం ఢిల్లీ సంస్థాగత వారసత్వంలోని విభిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయి.

విజయం, ప్రజాసేవ, వ్యక్తిగత భావ వ్యక్తీకరణకు ప్రతీకలుగా నిలిచే వివిధ వస్తువులను ఈ సేకరణలో చేర్చారు. వీటిలో రోహిణికి చెందిన ఒక విద్యార్థి గీసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ముఖచిత్రానికి సంబంధించిన అత్యంత సూక్ష్మమైన పెన్సిల్ స్కెచ్ ప్రత్యేకంగా ఉంది.

పారాలింపిక్స్‌లో రజత పతక విజేత యోగేశ్ కథునియా డిస్కస్ క్రీడా విజయం, పట్టుదలకు ప్రతీకగా నిలుస్తోంది. ఎన్‌సీసీకి చెందిన బంగారు పూతతో రూపొందించిన పరమ్ వీర్ మట్టి కలశ్ సేవ, స్మరణ స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది. వీటితో పాటు సహజంగా ఎండిపోయి, అస్థిపంజరంలా మారిన బోధి ఆకుపై అత్యంత నైపుణ్యంతో రూపొందించిన ఒక చిత్రపటం వ్యక్తిగత, కళాత్మక భావ వ్యక్తీకరణకు మరో కోణాన్ని తెలియజేస్తుంది.

రోహిణికి చెందిన ఒక విద్యార్థి నుంచి ఢిల్లీ మెట్రో, శాసనసభ, కొత్త పార్లమెంట్ భవనం వరకు.. ఈ జ్ఞాపికలు ఢిల్లీ నగరంలోని వివిధ ప్రాంతాలు, సంస్థలకు సంబంధించిన కథలను తమలో మోసుకొస్తున్నాయి. ఈ వేలం ద్వారా ఈ జ్ఞాపకాలకు మరింత విస్తృత ప్రజా ప్రయోజనం లభించనుంది.

# పెద్దపల్లి బీఆర్ఎస్‌లో బీసీల కొట్లాట

## తన్నుకున్న గులాబీ శ్రేణులు

కరీంనగర్, అక్టోబర్ 3: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆంఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సదస్సులో గులాబీ నాయకులు తన్నుకున్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సదస్సుకు నియోజకవర్గానికి చెందిన బీసీ నాయకులు గంట రాములు యాదవ్, దాసరి ఉష లతో పాటు ఇతర నాయకులను ఆహ్వానించలేదని ఆగ్రహించిన బీసీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

దాసరి మనోహర్ రెడ్డి వర్గానికి చెందిన కొంతమంది నాయకులు వారితో వాగ్వాదానికి దిగి తన్నుకున్నారు. కుర్చీలను విసిరేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింప చేసి పంపించారు. దాసరి మనోహర్ రెడ్డి ఒంటెద్దు పోకడల వల్ల నియోజకవర్గంలో పార్టీ పూర్తిగా లేకుండా పోయే పరిస్థితి వచ్చిందని పలువురు ఆరోపించారు. ఓడిపోయినా కూడా బీసీల అభిమానాన్ని మాజీ ఎమ్మెల్యే పూర్తిగా దెబ్బతీస్తున్నాడని ఇలా చేస్తూ పోతే పార్టీ పూర్తిగా పెద్దపల్లి లో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ వాదం వినిపిస్తుంటే పెద్దపల్లిలో మాత్రం బీసీలను అవమానిస్తున్నారని ఆరోపించారు.

# పశ్చిమాసియాలో రవాణా అంతరాయాల నేపథ్యంలో ఎగుమతిదారులకు రిలీఫ్ పథకం అమలు గడువును పొడిగించిన ప్రభుత్వం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:పశ్చిమ ఆసియా ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, దానివల్ల గల్ఫ్ తో పాటు పరిసర ప్రాంతాల సముద్ర రవాణాపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్ (ఈపీఎం) కింద తాత్కాలికంగా అమలు చేస్తున్న రెస్పాన్స్ లాజిస్టిక్స్ ఇంటర్వెన్షన్ ఫర్ ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటేషన్ (రిలీఫ్) పథకంలోని రెండవ విభాగానికి వర్తించే గడువును పొడిగిస్తూ సెప్టెంబర్ 30, 2026 తేదీన నోటిఫికేషన్ (నంబర్ 37/2026-27) ను విడుదల చేసింది.

రిలీఫ్' పథకంలోని కాంపోనెంట్-ఎఎ ద్వారా పశ్చిమ ఆసియా ప్రాంతాలకు ఎగుమతులు చేసే వ్యాపారులు ఈసిజిసి (ఈసీజీసీ) ఇన్సూరెన్స్ కవరేజ్ పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీని కింద ఎగుమతిదారులకు 95 శాతానికి పైగా నష్టపరిహార రక్షణ లభిస్తుంది. మార్చి 16, 2026 లేదా ఆ తర్వాత తీసుకున్న 'స్టాండ్ అలోన్ పాలసీలు' లేదా 'హోల్ టర్నోవర్ పాలసీల'కు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. ఇంధన రవాణాను మినహాయించి.. ఫుల్ కంటైనర్ లోడ్ (ఎఫ్సీఎల్), తక్కువ కంటైనర్ లోడ్ (ఎల్సీఎల్), శీతలీకృత (రీఫర్) కంటైనర్ల ద్వారా పంపే సరుకులకు ఈ బీమా రక్షణ అందుతుంది. అంతేకాకుండా, ఈ సంక్షోభ సమయానికి ముందు ఉన్న ప్రీమియం ధరలకంటే అదనంగా రూపాయి కూడా ఎగుమతిదారులపై భారం పడకుండా ప్రీమియం శాతాన్ని స్థిరంగా ఉంచుతున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

గల్ఫ్, పశ్చిమ ఆసియా సముద్ర మార్గాల్లో తలెత్తిన ఆటంకాల వల్ల పెరిగిన రవాణా ఛార్జీలు, విపరీతంగా పెరిగిన బీమా ప్రీమియంలు, యుద్ధ వాతావరణం కారణంగా ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న తీవ్ర నష్టాల నుంచి భారతీయ ఎగుమతిదారులకు వెసులుబాటు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్చి 19, 2026న 'రిలీఫ్' పథకాన్ని ప్రత్యేకంగా ప్రారంభించింది.

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు, రవాణా రంగంలో నెలకొన్న అనిశ్చితుల వేళ దేశీయ ఎగుమతులను బలోపేతం చేయడంతో పాటు, విదేశీ వ్యాపారం ఆటంకం లేకుండా సాగేందుకు, భారతీయ ఎగుమతిదారులకు అండగా నిలిచేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ గడువు పొడిగింపే నిదర్శనం.

# విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

## సామాజిక స్పృహ పెంపొందించాలి.. ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి.. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని, వారిలో సామాజిక స్పృహను




పెంపొందించి.. ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో తల్లిదండ్రులతో పాటు ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయులేనన్నారు.

విద్యార్థులు తమ సమస్యలను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులతో కూడా పంచుకునే అవకాశం ఉన్నందున పాఠశాలల్లో వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తన, ఆలోచనా విధానం, మనస్తత్వంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సమయంలో సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

సోషల్ మీడియా వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా, విజ్ఞతతో వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థులు ఆపదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి, ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో మహిళా భద్రతా బృందాల ఆధ్వర్యంలో మంచి స్పర్శ- చెడు స్పర్శ, బాలల రక్షణ, అంతర్జాల భద్రత తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్రావు, డీటీఓ శ్రీనివాస్, టీఆర్ఎస్ఎంఏ జిల్లా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అమిత్ షా పర్యటనకు పటిష్ట భద్రత

## ప్రతిమ వైద్య కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో పోలీసుల విస్తృత ఏర్పాట్లు



కరీంనగర్, అక్టోబర్ 3:కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న కరీంనగర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో గురువారం సీపీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశం నిర్వహించారు. హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు.

అక్టోబర్ 4న ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ భవనానికి శంకుస్థాపన, సిల్వర్ జూబ్లీ పైలాన్ ఆవిష్కరణ, ఫొటో ఎగ్జిబిషన్, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రతిమ మెడికల్ కాలేజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వాణిజ్యంలో లోపాలను సరిదిద్దడానికి డబ్ల్యూటీఓ నిబంధనలకు కట్టుబడి ఉండాలి: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టీకరణ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ విస్కాన్సిన్‌లోని మిల్వాకీలో జరిగిన జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం ముగింపు రోజు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పరిశ్రమల్లో మితిమీరిన ఉత్పత్తి సామర్థ్యం, ఉత్పత్తి విధానాలు, మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) సూత్రాల నవీకరణ, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో వెట్టి చాకిరీ/ నిర్బంధ శ్రమను అరికట్టడం వంటి కీలక అంశాలపై జరిగిన వివిధ చర్చా గోష్ఠులతో పాటు ముగింపు సమావేశంలోనూ ప్రసంగించారు.

పరిశ్రమల్లో మితిమీరిన ఉత్పత్తి సామర్థ్యం, ఉత్పత్తి విధానాలపై శ్రీ గోయల్ మాట్లాడుతూ, 140 కోట్ల జనాభా అవసరాలను తీర్చే అంతర్గత డిమాండ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థతో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న బహుళ ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో నమ్మకమైన భాగస్వామిగా నిలుస్తూ డిజైన్ నుంచి తుది ఉత్పత్తుల వరకు తయారీ రంగాన్ని విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. భారత తయారీ సామర్థ్యం దేశీయ అవసరాలతో పాటు అంతర్జాతీయ అవసరాలను కూడా తీరుస్తుందని, జీ20 అధ్యక్ష వర్గం గుర్తించిన రంగాలలో భారత్‌కు ఎటువంటి మితిమీరిన ఉత్పత్తి సామర్థ్యం లేదని స్పష్టం చేశారు.

కొన్ని దేశాల్లో ఇస్తున్న వ్యాపార సంబంధ రాయితీలు ఇతర దేశాల మార్కెట్లలోకి చౌకైన సరుకులను చొరబడేలా చేయడం, పోటీని దెబ్బతీసే విధంగా చాలా తక్కువ ధరలకు అమ్మడం వంటి చర్యలకు దారితీసున్నాయనే పలు జీ20 సభ్య దేశాల ఆందోళనలను భారత్ సమర్థిస్తుందని శ్రీ గోయల్ తెలిపారు. తగిన ఆధారాల పరిశీలన, న్యాయ సమీక్షలకు లోబడి ఉండే యాంటీ డంపింగ్, కౌంటర్ వెయిలింగ్ సుంకాల వంటి డబ్ల్యూటీఓ నిబంధనలకు కట్టుబడే చర్యల ద్వారానే ఈ ఆందోళనలకు పరిష్కారం చూపవచ్చని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం ఎంత ఉందనేది సమస్య కాదని, రహస్య రాయితీలు, ప్రభుత్వ అండతో ఉత్పత్తి అంతా ఒక్క ప్రాంతంలో కేంద్రీకృతమైనప్పుడే వాణిజ్యపరమైన లోపాలు ఉత్పన్నమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఉత్పత్తిని, సరఫరా వ్యవస్థలను విభిన్న ప్రాంతాలకు విస్తరించడం సమంజసమైన లక్ష్యమే అయినప్పటికీ.. దానిని సాకుగా పెట్టుకుని డబ్ల్యూటీఓ నిబంధనలకు విరుద్ధమైన చర్యలు చేపట్టడం గానీ, సర్దుబాటు భారాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలపై నెట్టడం గానీ సరికాదని ఆయన తేల్చి చెప్పారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ పారిశ్రామికీకరణకు అవసరమైన విధానపరమైన స్వేచ్ఛను తప్పనిసరిగా నిలుపుకోవాలని పేర్కొన్నారు. అలాగే గణాంకాలు, డేటా భాగస్వామ్యం అనేది ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యవస్థల పరిధిలోనే జరగాలని ఆయన సూచించారు.

అత్యంత ప్రాధాన్య దేశం (మోస్ట్ ఫేవర్డ్ నేషన్ - ఎంఎఫ్ఎన్) సూత్రాల నవీకరణపై శ్రీ గోయల్ మాట్లాడుతూ.. జీ20 సభ్య దేశాలతో భారత్ జరిపే వ్యాపారం పారదర్శకమైన, పక్షపాతం లేని, నిబంధనలతో కూడిన అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థపైనే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. ఈ విశ్వసనీయ వ్యవస్థకు 'మోస్ట్ ఫేవర్డ్ నేషన్' హోదానే ప్రాథమిక హామీ అని, చిన్నపాటి వ్యాపారి నుంచి అతిపెద్ద వ్యాపారి వరకు అందరికీ ఒకే రకమైన నిబంధనలు వర్తించేలా ఇది నిర్ధారిస్తుందని ఆయన తెలిపారు. డబ్ల్యూటీఓ కు ఏకాభిప్రాయమే అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా ఎదిగేందుకు ప్రత్యేక, వ్యత్యాసపూరితమైన వెసులుబాట్లను కొనసాగించాల్సిందేనని అన్నారు. అలాగే, నిలిచిపోయిన రెండు అంచెల వివాద పరిష్కార వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయన పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో శ్రమ దోపిడీని అరికట్టడంపై శ్రీ గోయల్ మాట్లాడుతూ.. శ్రమ దోపిడీని రూపుమాపే విషయంలో భారత ప్రభుత్వం సంపూర్ణమైన, షరతులు లేని కట్టుబాటుతో ఉందన్నారు. రాజ్యాంగంలోని 23వ ప్రకరణ (ఆర్టికల్ 23) శ్రమ దోపిడీని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా నిషేధించిందని, దీని అమలును సుప్రీంకోర్టు స్వయంగా పర్యవేక్షిస్తుందని ఆయన గుర్తుచేశారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధనలు 29, 105లను భారత్ ఇప్పటికే ఆమోదించిందని పేర్కొన్నారు. అంతేకాకుండా, శ్రమ దోపిడీతో తయారుచేసిన వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ జూలై 2026లో తమ విదేశీ వాణిజ్య విధానంలో సవరణలు కూడా చేసినట్లు మంత్రి తెలిపారు.

సరిహద్దు వద్ద తీసుకునే చర్యలు నిర్దిష్టమైన, ప్రామాణికమైన ఆధారాలపై ఉండాలి తప్ప ఒక దేశం, ప్రాంతం లేదా రంగానికి సంబంధించి కేవలం ముందస్తు అంచనాలతో కాదని శ్రీ గోయల్ తేల్చిచెప్పారు. ఈ ప్రక్రియలో సరైన పద్ధతులను, డబ్ల్యూటీఓ నిబంధనలను కచ్చితంగా గౌరవించాలని సూచించారు. కార్మిక ప్రమాణాల అమలుకు అంతర్జాతీయ కార్మిక సంస్థ మాత్రమే అత్యున్నత, సార్వత్రిక, త్రైపాక్షిక అధికారిక సంస్థ అని స్పష్టం చేశారు. శ్రమ దోపిడీని రూపుమాపడం, జీ20 దేశాల మధ్య అత్యుత్తమ విధానాల సమాచారాన్ని స్వచ్ఛందంగా మార్పిడి చేసుకోవడం వంటి లక్ష్యాలకు భారత్ మద్దతు ఇస్తుందన్నారు. అయితే, ఈ సహకారం నెపంతో సభ్య దేశాలపై నిఘా పెట్టడం, కొత్త నిబంధనలు రుద్దడం లేదా ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఏకపక్ష వాణిజ్య చర్యలకు పాల్పడటం వంటివి చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. మిల్వాకీలో ఏర్పాటు చేసిన అద్భుతమైన ఏర్పాట్లకు, చూపించిన ఆతిథ్యానికి గానూ అంబా సిడర్ గ్రీర్‌తో పాటు అమెరికా జీ20 అధ్యక్ష వర్గానికి శ్రీ గోయల్ ధన్యవాదాలు తెలిపారు. "కలిసి పరిష్కరించుకోలేని సమస్యలు మనం పరిష్కరించుకోగలిగే ఇతర అంశాలకు అడ్డంకిగా మారకూడదు" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గతంలో చెప్పిన అంశాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. భారత్ అదే స్ఫూర్తితో ఈ సమావేశంలో పాల్గొని, నాలుగు ముఖ్యమైన అంశాలపై తన ఆందోళనలను తెలియజేయడంతో పాటు నిర్మాణాత్మకమైన సలహాలను కూడా అందించిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలతో కూడిన, సమన్వయంతో కూడిన, పక్షపాతం లేని, పారదర్శకమైన, బహిరంగ, సమ్మిళిత, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు భారత్ కట్టుబడి ఉందనే విషయాన్ని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. ఏకాభిప్రాయం, ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకునే పద్ధతిని కాపాడుతూనే.. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థికంగా ఎదిగేందుకు, తమ ప్రజల ఆకలి తీర్చేందుకు అవసరమైన విధానపరమైన స్వేచ్ఛను అందించడం చాలా ముఖ్యమని ఆయన చెప్పారు. 2027లో జీ20 అధ్యక్ష బాధ్యతలను చేపట్టబోతున్న బ్రిటన్ కు శ్రీ గోయల్ భారత్ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు.

ఈ సమావేశాల సందర్భంగా ఆస్ట్రేలియా వాణిజ్య, పర్యాటక శాఖ మంత్రి, సౌదీ అరేబియా వాణిజ్య శాఖ మంత్రి, ఫ్రాన్స్ విదేశీ వాణిజ్యం, పెట్టుబడుల ఆకర్షణ వ్యవహారాల మంత్రి ప్రతినిధి, రిపబ్లిక్ ఆఫ్ కొరియా వాణిజ్య శాఖ మంత్రి, కెనడా అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రులతో శ్రీ గోయల్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

# అక్రమంగా గ్యాస్ సిలిండర్ల నిల్వ.. ఒకరిపై కేసు

## బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయం.. 14 సిలిండర్లు, టాటా ఏస్ స్వాధీనం

నల్గొండ, అక్టోబర్ 3: అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న ఒక వ్యక్తిపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ? చౌటుప్పల్ సీఐ జి మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎ. సైదయ్య తమ సిబ్బందితో కలిసి కొయ్యలగూడెం గ్రామంలో ఆకస్మిక దాడి (రైడ్) నిర్వహించారు.

ఈ దాడిలో వ్యాపారం చేసుకునే జబ్బారం గుజర్ (25) అనే వ్యక్తి టాటా ఏస్ వాహనం (నెంబర్: టీజీ 30టి 3321) లో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను ఉంచి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఆయన వద్ద నుంచి ?ఇండియన్ గ్యాస్ నిండిన పెద్ద సిలిండర్లు ? 10, ?భారత్ గ్యాస్ నిండిన పెద్ద సిలిండర్లు ? 2, ?చిన్న గ్యాస్ ఖాళీ సిలిండర్లు ? 2, ?పెద్ద ఇనుప రెగ్యులేటర్, ?టాటా ఏస్ వాహనం (టీజీ 30టి 3321) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ తెలిపారు.

# కొలనుపాక సోమేశ్వరాలయంలో వైభవంగా 'మహా ప్రదక్షిణ'



నల్గొండ, అక్టోబర్ 3:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో 'మహా ప్రదక్షిణ' కార్యక్రమం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది.

ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, దివ్య అర్చనలు నిర్వహించి వేదమంత్రాల మధ్య మహా ప్రదక్షిణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ ప్రదక్షిణతో ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమోగింది.

మహా ప్రదక్షిణ అనంతరం భక్తులు శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఏటా ఎంతో నిష్ఠతో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# సిరాతుల్ నబీ జల్సా విజయవంతం

నిజామాబాద్, అక్టోబర్ 3:నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణంలోని మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సిరాతుల్ నబీ జల్సా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు.

జహీరాబాద్ జిల్లా నుంచి మౌలానా అతిక్ సాహెబ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ..సిరాతుల్ నబీ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. అన్ని మతాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారు తమతో ఉన్నంతకాలం వారికి అన్ని విధాలుగా సేవలందించాలని సూచించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే భగవంతుడి ముందు సమాధానం చెప్పాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లకు కేటాయిస్తూ తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించడాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. యువత మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా ఐదు పూటలా నమాజ్ చేయడంతో పాటు ప్రతిరోజూ ఖురాన్ చదవాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు పేదలు, అవసరంలో ఉన్నవారిని గౌరవిస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఫ్తీ షౌకత్ బేగ్, మోసిన్,మౌలానా జమీల్, ఆఫీస్ సిరాజ్, ఆఫీస్ రియాజ్, ఆఫీస్ మోసిన్, ఆఫీస్ జలాల్, మక్కా మసీదు కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి..ప్రజలకు అనుసంధానకర్తలు

## జీపీవోల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. పరిష్కారానికి కృషి చేస్తా

## జీపీవోల ప్రథమ మహాసభలో నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, అక్టోబర్ 3:(నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య గ్రామ పాలనాధికారులు (జీపీవోలు) కీలక అనుసంధాన కర్తలుగా పనిచేస్తున్నారని డీసీసీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జీపీవోల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ, సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన జీపీవోల ప్రథమ మహాసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించి వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిందని ఆరోపించారు. భూ వ్యవహారాల్లో అక్రమాలు వెలుగులోకి రాకుండా ఉండేందుకే వీఆర్వో వ్యవస్థను తొలగించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామస్థాయిలో పరిపాలనా సేవలను మరింత సమర్థంగా అందించేందుకు గ్రామ పాలనాధికారుల సేవలను వినియోగించుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో జీపీవోలను మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం జీపీవోల సంఘం ప్రతినిధులు తమ సమస్యలు, డిమాండ్లను నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీపీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మల్లారం అర్జున్, విజయ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.చిరంజీవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పృథ్వీరాజ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలు విజయవంతం చేయాలి

అమరావతి, అక్టోబర్ 3: ఈ నెల11 నుంచి 20వ తేదీ వరకు జరిగే దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.

శనివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారి దేవస్థానంలో జరిగే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు, శ్రీ రాజరాజేశ్వరి సమేత రాజశేఖర స్వామి వారి దేవస్థానంలో జరిగే శరన్నవరాత్రి దేవీయాగ మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిని దేవస్థానం తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి సమేత రాజశేఖర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఘంటసాల రాజమోహనరావు, దేవస్థానముల ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు), రాజశేఖర స్వామి దేవస్థానం ట్రస్టీలు విష్ణుభోట్ల లక్ష్మీనరసమ్మ, అవనిగడ్డ రమేష్, వెణుతురుమిల్లి వెంకటేశ్వరరావు, కోసూరు అవినాష్, శ్రీ లంకమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి ట్రస్టీలు మత్తి శివపార్వతి, బట్టు మాధవి మోపిదేవి శివకుమార్, నలుకుర్తి రాము, దేవస్థానముల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం బీఆర్ఎస్ ఆందోళన



నిజామాబాద్, అక్టోబర్ 3: బిక్కనూర్ మండల కేంద్రానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మండల కేంద్రంలోని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలను ఇతర మండలానికి తరలించడాన్ని రసిస్తూ శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.

స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రహదారిపై బిఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతమంది స్వార్థం కోసం పాఠశాలను ఇతర మండలానికి తరలించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.200 కోట్లలతో ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తక్షణమే మండల కేంద్రంలో నిర్మించాలని డిమాండ్ చేశారు . మండల కేంద్రంలో అనుకూలమైన స్థలం అందుబాటులో ఉందన్నారు. ఈ విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు .లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు రహదారిపై బైఠాయించడంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బిఆర్ఎస్ శ్రేణులను బుజ్జగించి ఆందోళన విర మించేందుకు ప్రయత్నం చేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు ఆందోళన కారులను బలవంతంగా బయటకు నెట్టి చేసి ఆందోళన విరమింప చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్ రెడ్డి, పాల రామచంద్రం, అత్తిలి శ్రీనివాస్, సాయ గౌడ్, భూమ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రంజిత్ వర్మ ,బసవయ్య, శ్రీనివాసరెడ్డి ,బాలకిషన్, రాజమౌళి, వెంకట్ గౌడ్, తునికి వేణు, పైతరి స్వామి బుర్రి గోపాల్, మద్ది ,స్వామి, మల్లారెడ్డి, ప్రభాకర్, నరేష్, మధు మోహన్ రెడ్డి ,సిద్ధా గౌడ్, శ్రీనివాస్, తక్కల మధుసూదన్ రెడ్డి, బండ్ల రాజు రెడ్డి, పోతిరెడ్డి, సురేందర్ రెడ్డి, బాపురెడ్డి కార్యకర్తలు పాల్గొన్నార.

# ఫెర్టిలైజర్ సేల్ పాయింట్ ప్రారంభం

నిజామాబాద్, అక్టోబర్ 3:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ సొసైటీ పరిధిలోని రాహత్‌నగర్ గ్రామంలో శనివారం నూతన ఫెర్టిలైజర్ సేల్ పాయింట్‌ను ప్రారంభించారు.

రాష్ట్ర పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవతో ఆయన సొంత గ్రామమైన రాహత్‌నగర్‌లో ఈ ఫెర్టిలైజర్ సేల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు యూరియాను విక్రయించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బంగ్లా దేవేందర్, వైస్ చైర్మన్ భూరెడ్డి గంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, గ్రామ సర్పంచ్ లాకావత్ తిరుపతి, ఉప సర్పంచ్ సేవాలాల్, రైతులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు

# గాంధీ జయంతి వేడుకలతో ఎస్ఈసీఎల్‌లో ఘనంగా ముగిసిన 'స్వచ్ఛతా హి సేవా 2026' ప్రచారం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలోని తన అన్ని కార్యాలయాలు, ప్రాజెక్టుల్లో నేడు గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలతో 'స్వచ్ఛతా హి సేవా 2026' ప్రచారాన్ని ఘనంగా ముగించింది.

2026 సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించిన ఈ ప్రచారంలో భాగంగా ఎస్ఈసీఎల్ పది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని తన కార్యకలాపాల పరిధిలో లక్ష్యంగా పెట్టుకున్న 55 పైగా యూనిట్లలో విస్తృత పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టింది.

ఈ ప్రచారంలో భాగంగా వీధి నాటకాలు, పాఠశాలల్లో పోటీలు, శ్రమదానం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలతో సహా విస్తృతమైన చైతన్య, సమాజ భాగస్వామ్య కార్యక్రమాలను చేపట్టారు. పరిశుభ్రతను ప్రోత్సహించడం, ప్రజల్లో ప్రవర్తనా మార్పును తీసుకురావడం లక్ష్యంగా చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2026 ముగింపు దశతో పాటు ప్రత్యేక ప్రచారం - 6 అమలు దశ కూడా ప్రారంభమైంది. 2026 సెప్టెంబర్ 30న సన్నాహక దశ పూర్తికాగా, ఈ రోజు (అక్టోబర్ 2) అమలు దశ ప్రారంభమై అక్టోబర్ 31, 2026 వరకు కొనసాగుతుంది. ఈ ఏడాది ప్రచారంలో ఈ - వ్యర్థాల సమర్థవంతమైన సేకరణ, వేరు చేయడం, శాస్త్రీయంగా నిర్మూలించడం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రత్యేక ప్రచారం -6లో భాగంగా పరిశుభ్రత కార్య క్రమాల నిర్వహణకు ఎస్ఈసీఎల్ దేశవ్యాప్తంగా 225 ప్రాంతాలను గుర్తించింది. ఈ కార్యక్రమం కింద సుమారు 40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని శుభ్రం చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ప్రచార కాలంలో 3,300 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించి పారవేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.రికార్డుల నిర్వహణలో భాగంగా ఎస్ఈసీఎల్ 500 ఫైళ్లను పరిశీలించి, 200 ఫైళ్లను, 7,000 ఈ - ఫైళ్లను సమీక్షించి, 3,000 ఈ-ఫైళ్లను తొలగించనుంది. అమలు దశలో పరిశుభ్రత, స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించడం, వ్యర్థాల తొలగింపు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ పనులను తగ్గించడం, ఈ - వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమాలు ఎస్ఈసీఎల్ ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ కార్యకలాపాలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో చేపట్టనున్నారు.

# భక్తుల అంతరంగాల్లో యోగజ్యోతి వెలిగించడమే పిండి దీపారాధన లక్ష్యం

## వైభవంగా పిండి దీపోత్సవ శోభాయాత్ర : టీటీడీ జేఈవో ప్రభల గోపీనాథ్

తిరుపతి, అక్టోబర్ 3: పవిత్ర పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించి, వారి అంతరంగాల్లో భక్తి, జ్ఞాన జ్యోతులను వెలిగించడమే పిండి దీపోత్సవ లక్ష్యమని టీటీడీ జేఈవో (విద్యా, ఆరోగ్యం) ప్రభల గోపీనాథ్ తెలిపారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీబీసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం టీటీడీ పరిపాలనా భవనం పరేడ్ మైదానం నుంచి అలిపిరి పాదాల మండపం వరకు పిండి దీపోత్సవ శోభాయాత్ర మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగింది. మనసును పిండిగా, జ్ఞానాన్ని జ్యోతిగా భావించి ఆరాధించాలని జేఈవో సూచించారు. పిండి దీపారాధనతో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉందన్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డాక్టర్ వేడసాని మోహన్ మాట్లాడుతూ భక్తులు తమ మనసును పిండిగా, జ్ఞానాన్ని జ్యోతిగా భావించి భగవంతుడిని ఆరాధించాలని సూచించారు. కురవ నంబి, తొండమాన్ చక్రవర్తి పిండి దీపంతో శ్రీవారిని ఆరాధించిన విశేషాలను వివరించారు. శోభాయాత్రకు ముందు టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలో అర్చకులు పిండి దీపానికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# న్యూఢిల్లీలో జరుగుతున్న అయిదో కౌటిల్య ఆర్థిక సదస్సులో ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభోపన్యాసం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:ఈ రోజు న్యూఢిల్లీలో "మారుతున్న యుగంలో స్థిరత్వం" అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న అయిదో కౌటిల్య ఆర్థిక సదస్సులో ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విధాన రూపకర్తలు, ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, ఇతర విశిష్ట అతిథులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో పటిష్ఠమైన, సమ్మిళితమైన, స్పందించే ఆర్థిక విధానాల ఆవశ్యకత గురించి వివరించారు.

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ (ఐఈజీ) విశిష్టత గురించి ఉపరాష్ట్రపతి వివరించారు. ప్రొఫెసర్ వీకేఆర్‌వీ రావు నేతృత్వంలో 1952లో ఈ సంస్థ ప్రారంభమైందని, అప్పటి నుంచి భారతదేశ అభివృద్ధి ప్రస్థానంతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పటిష్టమైన విధానాలు రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సరళంగా, స్పందించేలా విధానాలు ఉండాలని తెలియజేశారు.

నిరంతరం మార్పులు చోటు చేసుకుంటున్న సమయంలో ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవాలని శ్రీ సీపీ రాధాకృష్ణన్ సూచించారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, వాదోపవాదాలు అంతర్భాగమన్నారు. అయితే అందరి ఆమోదం పొందే నిర్ణయాలకు అవి మార్గం చూపాలన్నారు. స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన చర్చ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని... హక్కులు, బాధ్యతలు రెండూ సమన్వయంతో సాగాలని రాజ్యసభ ఛైర్మన్‌గా స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యం, అభివృద్ధి కలిసి ప్రయాణించగలవని భారత్ నిరూపించిందని ఉపరాష్ట్రపతి వెల్లడించారు. ప్రజాస్వామ్య నియమాలతోనే భారతదేశం ఆర్థిక వృద్ధిని, సమ్మిళిత ప్రగతిని సాధించిందని తెలియజేశారు. అదే సమయంలో ఏకాభిప్రాయ నిర్మాణం... ఆర్థిక సంస్కరణలను మరింత పటిష్టంగా, సుస్థిరంగా మార్చిందని వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరమైన ముఖ్యమైన పునాదిని ఈ అనుభవం అందిస్తుందన్నారు.

సామాజిక స్థిరత్వం నుంచి ఆర్థిక స్థిరత్వాన్ని వేరు చేయలేమని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. ఆర్థిక సమ్మిళిత్వాన్ని, పారదర్శకతను, వ్యవస్థీకరణను బలోపేతం చేయడంలో జేఏఎం త్రయం, ప్రత్యక్ష నగదు బదిలీ, జీఎస్టీ కీలకపాత్ర పోషించాయని ఉపరాష్ట్రపతి అన్నారు. 2026 ఆగస్టు నాటికి 590 మిలియన్లకు పైగా జన్‌ధన్ ఖాతాలను తెరిచారని వెల్లడించారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్లు 2017లో 6.65 మిలియన్ల నుంచి 2026 మే నాటికి 16.5 మిలియన్లకు పెరిగాయని కూడా తెలియజేశారు.

ప్రజలను వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడంతో పాటు వారు కూడా సంపదను సృష్టించేలా, ఆదాయాన్ని పొందేలా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని శ్రీ సి. పి. రాధాకృష్ణన్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 మిలియన్లకు పైగా మహిళలకు సుమారు 9.2 మిలియన్ల స్వయం సహాయక బృందాలు అందిస్తున్న తోడ్పాటు గురించి, 34.6 మిలియన్లకు పైగా లఖ్‌పతి దీదీల గురించి ఆయన వివరించారు. మహిళా సాధికారత దశ నుంచి మహిళా నేతృత్వంలో అభివృద్ధి దిశగా మారిన భారత్ ప్రయాణాన్ని విద్య, ఆర్థిక రంగాల్లో క్రమంగా పెరుగుతున్న మహిళల భాగస్వామ్యం సూచిస్తోందని తెలియజేశారు.

కేవలం బోర్డు రూములు, ఆర్థిక విపణులతోనే స్థిరత్వం సాధ్యం కాదని ఉపరాష్ట్రపతి అన్నారు. గ్రామంలోని మహిళకు కూడా బ్యాంకు ఖాతా ఉండి, ప్రభుత్వ ప్రయోజనాలను నేరుగా పొందుతూ, వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశించినప్పుడే, ఓ స్వయం సహాయక బృందాన్ని వ్యాపార సంస్థగా మార్చినప్పుడే నిజమైన స్థిరత్వం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కడు పేదరికం నుంచి 250 మిలియన్ల మంది భారతీయులు బయటపడటాన్ని చారిత్రక విజయంగా ఆయన వర్ణించారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రతి రాష్ట్రం, ప్రతి జిల్లా, ప్రతి గ్రామం సమాన భాగస్వామ్యాన్ని పంచుకోవాలన్నారు.

విస్తృత పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాలకు శ్రీ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ గ్రోత్ మధ్య సహకారాలను ఆయన స్వాగతించారు. విస్తరిస్తున్న భారతదేశ వాణిజ్య ఒప్పందాలతో పాటుగా ఇలాంటి భాగస్వామ్యాలు పరిశోధనను, విద్యను, ఆవిష్కరణలను, ఔత్సాహిక పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తాయన్నారు.

మార్పును వ్యతిరేకించడం కాకుండా... దానిని విశ్వాసంతో, సమ్మిళిత్వంతో, సామూహిక స్ఫూర్తితో స్వీకరించినప్పుడు మాత్రమే భారత్ స్థిరత్వం సాధిస్తుందంటూ ఉపరాష్ట్రపతి తన ప్రసంగాన్ని ముగించారు. అయిదో కౌటిల్య ఆర్థిక సదస్సులో చేపట్టే చర్చలు 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించాలనే దేశ లక్ష్యానికి అర్థవంతంగా తోడ్పడతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఈజీ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ అధ్యక్షులు శ్రీ ఎన్‌కే సింగ్, ఐఈజీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ డాక్టర్ మైఖేల్ దేబబ్రత పాత్ర, ఇతర విశిష్ట అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కులకు అండగా ఉంటాం

## ఉద్యోగ భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హన్మకొండ, అక్టోబర్ 3:(నేటినిజం ప్రతినిధి) ఆర్టీసీ కార్మికుల హక్కులను కాపాడడంతో పాటు ఉద్యోగ భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో శనివారం హనుమకొండ, వరంగల్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి హనుమకొండ డిపో పరిధిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్-2029 నాటికి మాదకద్రవ్యాల ముఠాలను అంతం చేసేందుకు కట్టుబడి ఉన్న మోదీ ప్రభుత్వం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 3:మాదకద్రవ్యాల అక్రమ రవాణా కీలక సూత్రధారి నవ్‌ప్రీత్ సింగ్‌ను టర్కీ నుంచి భారత్‌కు రప్పించటంలో చరిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేసిన భద్రతా ఏజెన్సీలను కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అభినందించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు. "నవాబ్ విర్క్ అనే నకిలీ పేరుతో టర్కీ పౌరసత్వాన్ని పొందిన నవ్‌ప్రీత్ సింగ్ కుట్రలను ఛేదించి, మోదీ ప్రభుత్వం చరిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేసింది. అతన్ని టర్కీ నుంచి బహిష్కరించేలా చేసి, భారత్‌కు రప్పించింది. నకిలీ గుర్తింపు ముసుగులో తలదాచుకున్న అతను, ఆఫ్ఘనిస్తాన్ నుంచి భారత్‌కు హెరాయిన్, మెథాంఫెటమైన్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నాడు. మన భద్రతా ఏజెన్సీలు అతడి అడుగుజాడలను పసిగట్టి, అసలు గుర్తింపును వెలికితీసి, అతను బహిష్కరణకు గురయ్యేలా చేశాయి. నేడు అతడిని భారత్‌కు రప్పించి డ్రగ్స్ అక్రమ రవాణా, ఇతర నేరాల కేసులకు సంబంధించి జైల్లో పెట్టారు. ఈ విజయం సాధించిన ఏజెన్సీలన్నింటికీ అభినందనలు. డిసెంబర్-2029 నాటికి మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలను పూర్తిగా అంతం చేయటమే మోదీ ప్రభుత్వ లక్ష్యం" అని అన్నారు. పరారైన నేరస్థులను దేశానికి రప్పించేందుకు మోదీ ప్రభుత్వం సమన్వయ ప్రచారాన్ని ప్రారంభించింది. 2019 నుంచి 2026 ఆగస్టు నాటికి మొత్తం 36 దేశాల నుంచి 288 మంది పరారైన నేరస్థులను భారత్‌కు రప్పించింది. పరారైన నిందితులను వెనక్కి తీసుకువచ్చేందుకు గత ప్రభుత్వాలకు రాజకీయ పరమైన శక్తి లేదు. నేరస్థుల అప్పగింతను 'జాతీయ ప్రాధాన్యత'గా మోదీ ప్రభుత్వం మార్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టికి అనుగుణంగా కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా... పరారైన నేరస్థులపై త్రిముఖ వ్యూహాలైన ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు, బలమైన సమన్వయం, క్రియాశీల దౌత్యనీతి గురించి వివరించారు. దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వం, శాంతిభద్రతలు, జాతీయ భద్రతతో పరారైన నేరస్థుల సమస్య ముడిపడి ఉంటుందని శ్రీ అమిత్ షా అన్నారు. 2019లో ఎన్‌ఐఏ (సవరణ) చట్టం, యూఏపీఏ (సవరణ) చట్టాలను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. దీనితో 2020 నుంచి పరారై విదేశాల్లో ఉన్న నిందితులను భారత్‌కు రప్పించే ప్రక్రియను ప్రత్యేక మిషన్‌గా చేపట్టింది. ఫలితంగా, చట్టవిరుద్ధమైన సంస్థలపై మాత్రమే నిఘాను పరిమితం చేయకుండా, విదేశాల్లో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులు, హ్యాండ్లర్లు, నిధుల సేకరణ వ్యవస్థలు, వారికి సహకారం అందిస్తున్న వ్యవస్థల దిశగా చర్యల పరిధిని విస్తరించారు. ఇది పరారీలో ఉన్న వారిపై నిఘా పెట్టటంలో, వారి వ్యవస్థలను కూల్చివేయటంలో భారత్ సామర్థ్యాన్ని గణనీయంగా బలోపేతం చేసింది. భారత్, ప్రపంచ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల మధ్య సమన్వయం, అనుసంధానం, సమాచార భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా 2025 జనవరిలో 'భారత్‌పోల్' ప్రారంభించారు. సీబీఐ, రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయాలు (ఇంటర్‌పోల్ లైజన్ ఆఫీసర్లు - ఐఎల్‌ఓలు), జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాలను అనుసంధానించటం ద్వారా భారత్‌పోల్ సమగ్ర సమాచార మౌలిక సదుపాయాలను కల్పించింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర, కేంద్ర సంస్థలకు చెందిన 1,400లకు పైగా యూనిట్లు ఈ పోర్టల్‌తో అనుసంధానమయ్యాయి. తద్వారా సమాచారాన్ని సులభంగా సేకరించవచ్చు. ఫలితంగా సీబీఐ, ఇతర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల మధ్య సమాచార మార్పిడికి పట్టే సమయం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం సీబీఐ కోరిన సమాచారాన్ని ఇతర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు సాధారణంగా 10 నుంచి 20 రోజుల్లోపు, కొన్ని సందర్భాల్లో 3 నుంచి 10 రోజుల్లోపు అందిస్తున్నాయి. ఇది విచారణలు, అప్పగింత సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరిచింది.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం

కరీంనగర్, అక్టోబర్ 3: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు, రాఘవపూర్‌లో ఇందిరా మహిళా శక్తి భవనం, పెద్దపల్లి బస్ డిపో, కూనారం రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అప్పన్నపేటలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనం పనులు పూర్తయినందున ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు తెలియజేశారు.

# పార్కుల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## -కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూల్ అక్టోబర్ 3: కర్నూలు నగరంలోని పార్క్‌ల్లో చేస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శనివారం స్థానిక డాక్టర్స్ కాలనీ లోని సంస్కృతి పార్క్, కిషన్ నగర్ పార్క్, మాధవ్ నగర్‌లోని సైన్స్ పార్క్‌ల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ పార్కులను పరిశీలిస్తూ, అన్ని పార్క్‌ల్లో బెంచ్‌లు, లైటింగ్, వ్యాయామానికి సంబంధించిన పరికరాలు, పిల్లల ఆటలకు సంబంధించిన పరికరాలు తదితర మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెరిగేలా మొక్కలను పెద్ద ఎత్తున నాటాలన్నారు..ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు పార్కులను సద్వినియోగం చేసుకునేలా అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

# పిల్లల చదువుల బాధ్యత శ్రీసిటీదే.. అర్హతను బట్టి ఒకరికి ఉద్యోగం..

## విధుల్లో నిర్లక్ష్యం.. బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు (సస్పెన్షన్)

## ప్రమాద కారణాలపై నాలుగు శాఖలతో సిట్ దర్యాప్తు

## సెజ్‌లోని అన్ని పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్

## వివరాలు వెల్లడించిన తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు

తిరుపతి, అక్టోబర్ 3:శ్రీసిటీలోని ట్యాబ్లెట్ ఇండియా (టిల్ హెల్త్ కేర్) పరిశ్రమలో జరిగిన ఘోర బాయిలర్ పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రకటించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాధితులకు తక్షణ సాయం అందేలా చర్యలు చేపట్టామన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాద ఘటనపై తీసుకున్న పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు, వారి పిల్లల విద్యా ఖర్చులను పూర్తిగా శ్రీసిటీ యాజమాన్యమే భరిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉన్నత విద్య చదివే వారికి ఈ సాయం అందుతుందన్నారు. కుటుంబంలో అర్హులైన వారిని గుర్తించి శ్రీసిటీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పోస్టుమార్టం పూర్తయిన వెంటనే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి, శ్రీసిటీ యాజమాన్యం ఖర్చులతోనే దహన సంస్కారాలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఈ ఘోర ప్రమాదానికి బాధ్యత వహిస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను నిగ్గుతేల్చేందుకు బాయిలర్స్, ఫ్యాక్టరీస్, ఇండస్ట్రీస్, పోలీస్ శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామన్నారు. దర్యాప్తులో ఎవరి తప్పు ఉన్నా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించి పాత ఫైళ్లను కూడా పునఃపరిశీలిస్తున్నామన్నారు.

సాధారణంగా పరిశ్రమల్లోని బాయిలర్ల జీవితకాలం 20 నుంచి 30 ఏళ్ల వరకు ఉంటుందని, అయితే పేలిపోయిన బాయిలర్‌ను ఏర్పాటు చేసి కేవలం 12న్నర సంవత్సరాలే అవుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు. ఏ సాంకేతిక లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందనేది పూర్తి స్థాయి శాస్త్రీయ పరిశీలన తర్వాతే నిర్ధారణ అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

శ్రీసిటీ ఏర్పాటైన 18 ఏళ్ల చరిత్రలో ఇంతటి భారీ ప్రమాదం జరగడం ఇదే తొలిసారని కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో తక్షణమే భద్రతా ప్రమాణాలను సమీక్షించి, థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏవీఎం విద్యార్థులు ఎంపిక

నల్గొండ, అక్టోబర్ 3: నకిరేకల్ పట్టణంలోని ఏవీఎం పాఠశాలకు చెందిన విద్యార్థులు కట్టంగూర్ మండలం చెరువు అన్నారం జడ్పిహెచ్ఎస్ లో నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్ 14, విభాగాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కందాల పాపిరెడ్డి, ప్రిన్సిపల్ కందాల స్వప్న శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న ఎం.చైత్ర రెడ్డి, అండర్ 14 బాలుర విభాగంలో 9వ తరగతి డి.అరవింద్ నాయక్ ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు నిమ్మల శంకర్ గౌడ్, పూజితను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

# చిత్రకళా రంగంలో కూరెళ్ల శ్రీనివాస్‌కు ప్రతిభా పురస్కారం

## రూ.30,116 నగదు పారితోషికంతో ఘన సత్కారం

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారం ప్రదానం



నల్గొండ, అక్టోబర్ 3: చిత్రకళా రంగంలో విశిష్ట సేవలు అందించిన నల్లగొండకు చెందిన ప్రముఖ చిత్రకారుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కూరెళ్ల శ్రీనివాస్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ నాంపల్లిలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై చిత్రలేఖన విభాగంలో ఎంపికైన కూరెళ్ల శ్రీనివాస్‌ను రూ.30,116 నగదు పారితోషికంతో ఘనంగా సత్కరించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

## నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు-మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాల, అక్టోబర్ 3:చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని మంచిర్యాల డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎగ్గాడి భాస్కర్ ప్రజలను హెచ్చరించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని గంగారెడ్డి రోడ్డు, మార్కెట్ రోడ్డులోని మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు తప్పవని వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు ఉలంఘిస్తే ఆర్టీఓ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. రానున్నదసరా, దీపావళి సందర్భంగా తెలంగాణలోనే మెజారిటీ సభ్యులు నిర్వహించుకునే దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రం



మంచిర్యాల పట్టణంలో వ్యాపార సముదాయాల ప్రాంతాల్లో జన సంద్రోహం పెరిగిపోతుందన్నారు. ఇతర జిల్లాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా కొనుగోలుదారులతో పట్టణం కిక్కిరిసిపోతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీస్ నిఘా పెంచి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలు అనుమానాస్పద వ్యక్తులను విచారించి కట్టుదిట్టమైన భద్రత మధ్య నాకా బందీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల సీఐ ప్రమోద్ రావు, మంచిర్యాల రూరల్, శ్రీరాంపూర్ సీఐల తోపాటు ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు





## అక్టోబర్ 4... కామేశ్వర రావు జయంతి

తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావు ది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్, పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసం లాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలి పోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం.

కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసే వారు. విడుదలైన తెలుగు సినిమాలను; న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలే గాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా వ్రాసేవారు. 1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బుక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి.

ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని వ్రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని వ్రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయాన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మం లాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద వ్రాసిన విమర్శలే కామేశ్వర రావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల. మొదట్లో రచయితగా పని చేశారు. అదే సమయంలోనే కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు.

వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు.

బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్రరావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభా వంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే.

కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు. ఆ తర్వాత తీసిన 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు.

1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'మహామంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫీస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమ్రోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరరావుకు మంచి పేరు తెచ్చుకుంది.

కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్.వి.రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు.

అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి.

పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది. ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు.

'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి.

దర్శకుడిగా కమలాకర కామేశ్వరరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా? ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

## -నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, అక్టోబర్ 3: (నేటినిజం ప్రతినిధి). కరీంనగర్ నగరపాలక సంస్థను తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. 29వ డివిజన్ కిసాన్ నగర్, మింగని వాడ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్తో కలిసి యూఐడీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

28, 29వ డివిజన్ల పరిధిలోని హనుమాన్ దేవాలయం సమీపంలో×15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షలతో ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా కోసం చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులు?అధికారుల సమన్వయంతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మేయర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర, గాజా రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 'పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి'

## టి.ఎం.ఎస్.రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల రవన్న మాదిగ



నల్గొండ, అక్టోబర్ 3: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సైన్యం (టీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల రవన్న మాదిగ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నల్లగొండలోని తెలంగాణ మాదిగ సైన్యం జిల్లా కార్యాలయంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ మాదిగ సైన్యం సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల కోసం అద్దె హాస్టల్ భవనాలపై ఆధారపడకుండా సొంత భవనాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొడతాల నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి నక్కల సైదులు, జిల్లా అధ్యక్షుడు నరసింహ, టీఎంఎస్ నాయకులు పెదమం శివ, గిరి, చందు, మోహన్ పాల్గొన్నారు.

# తిరుపతిలో ఘోర ప్రమాదం.. పరిశ్రమలో బాయిలర్ పేలి ఐదుగురు దుర్మరణం



తిరుపతి, అక్టోబర్ 3:తిరుపతి జిల్లా శ్రీసిటి పరిశ్రమవాడలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ట్యాబ్లెట్లు తయారు చేసే టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో ఒక్కసారిగా బాయిలర్ పేలి మంటలు వ్యాపించాయి. నైట్ షిఫ్ట్‌లో ఉన్న ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే చనిపోగా మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు విడిచారు.

మృతుల్లో ఇద్దరు సత్యవేడు మండలం చెరివి గ్రామానికి చెందిన చిన్న మస్తాన్, రమేశ్, తమిళనాడులో నాయుడు కుప్పానికి చెందిన మోహన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరబ్‌రాయ్, తడకు చెందిన వాసు మృతి చెందినట్లు అధికారులు వివరించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబుగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సర్" ప్రోగ్రాం పై వేములవాడ పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రా పె ల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన

## బిజెపి రాష్ట్ర సర్ ప్రోగ్రాం ఇన్చార్జి హరిదాసు పరిశీలన



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో జరుగుతున్న సర్ ప్రోగ్రాం పరిశీలనలో భాగంగా బిజెపి రాష్ట్ర సర్ ప్రోగ్రాం ఇన్చార్జి హరిదాసు సందర్శించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో వేములవాడలోని పలు వార్డులలోని బిఎల్ ఏ లతో చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా హరిదాసు మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్క భారతీయునికి ఓటు హక్కు ఉండాలని ఉద్దేశంతో బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేస్తుందని అన్నారు వేరే దేశం ఓటర్లు ఎవరు ఉన్నా అలాగే రెండు దఫాలుగా ఓటు ఉన్న వారి ఓట్లు తొలగించడానికి మాత్రమే ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి సర్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని అన్నారు ఈ ప్రోగ్రాం చివరి తేదీ ఈనెల 7 వరకు మాత్రమే కనుక ఇంకా ఎవరైనా కొత్త ఓటర్లు ఉన్న నోటీసు వచ్చిన వారు కూడా మీ వద్ద ఉన్న అధికారిక 13 రకాల గుర్తింపు కార్డులతోటి మున్సిపల్ కమిషనర్ లేదా ఎమ్మార్వో ముందు గానీ వివరణ ఇవ్వవలసిందిగా వారు కోరారు ఈ సందర్భంగా అతనికి పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాజన్న ప్రసాదం అందజేసి, కండువాతో ఘనంగా సత్కరించారుఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కుమ్మరి శంకర్ మైలారం శ్రీనివాస్ వంగల శ్రీనివాస్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ వివేక్ రెడ్డి జవ్వాజి శేఖర్ కోల మారుతి మల్లేశం యాదవ్ సాయి మోక్షిత్ హరీష్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

## ఇండియా కూటమి డిమాండ్..



వరంగల్, అక్టోబర్ 3: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పదవి నుంచి జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ హరిత హోటల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు సిపిఎం జిల్లా జి.ప్రభాకర్ రెడ్డి,న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు, తెలంగాణ జన సమితి నాయకులు చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు . ప్రజాస్వామ్యాన్నిఖూనీ చేస్తున్నా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన సీఈసీని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. అడ్డ దారిలో అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ఎన్నికల కమిషన్ ను ఉపయోగించుకున్నదని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొదటి నుండి చేస్తున్న ఆందోళన నిజమైందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎన్నికలలో ఓట్ చోరీపై నోరు మెదపడం లేదన్నారు. ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఓట్ చోరీపై ఆందోళనకు పిలుపునిచ్చిందని, ఈ నెల 5న హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ నుంచి ఉ. 0 గంటలకు జిల్లా కలెక్టరేట్ వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి అనిల్ ప్రియాంక, నాయకులు మార్క విజయ్ కుమార్, బంక సరళ, సంపత్, పింగళి వెంకట్రామ్ రెడ్డి, జక్కుల రవీందర్, బోడ డిన్న, సిపిఐ నాయకులు కర్రె బిక్షపతి ఆదరి శ్రీనివాస్ తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్,ఎన్ఏ స్టాలిన్, మునిగాల బిక్షపతి, సిపిఎం నాయకులు బొట్ల చక్రపాణి, టి. ఉప్పలయ్య, వీరన్న, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.